

మంత్రి వర్గ సమావేశంలో మండిపల్లి


# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

బుధవారం 16 ఏప్రిల్ 2025


దార్తి ఆబా జన్ జాటియ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమాన్ని

# పక్కాగా అమలు అవ్వాలి

**జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్**

**రాయచోటి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త**



దార్తి ఆబా జన్ జాటియ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమాన్ని గిరిజన జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో పక్కాగా అమలు అవ్వాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో నిర్వహించబడే దార్తి ఆబా జన్ జాటియ గ్రామ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంపై జిల్లా గిరిజన సంక్షేమ శాఖ హౌసింగ్ పంచాయతీరాజ్ గ్రామీణ నీటి సరఫరా శాఖ విద్యుత్ వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారులతో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సురేష్ సమావేశాన్ని ప్రారంభిస్తూ అన్నమయ్య జిల్లాలో నాలుగు మండలాలలోని 17 గ్రామాలు ఈ కార్యక్రమం కింద ఎంపిక కాబడ్డాయని ఈ గ్రామాలలో 50 శాతం పైబడి జనాభా గిరిజనులు ఉన్నట్లుగా జిల్లా సంయుక్త కలెక్టర్ కు వివరించారు. ఈ గ్రామాలలో వివిధ శాఖల సమన్వయంతో కేంద్ర ప్రభుత్వ సహాయంతో పక్కా ఇళ్ల నిర్మాణం, జలజీవన్ మిషన్, ఇంటింటికి విద్యుత్తు, సోలార్ ప్యానల్ నిర్మాణం, జాతీయ హెల్త్ మిషన్, ఉజ్వల యోజన, పోషణ్ అభియాన్, సమగ్ర శిక్ష, తదితర పథకాలను అమలు చేయబోతున్నామన్నారు. అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులు 50 శాతం పైగా ఉన్న గ్రామాలపై దృష్టి సారించారని పార్టీ అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీ మరియు మండల స్థాయి కమిటీలు ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమాలపై సమీక్ష సమావేశాలను నిర్వహించుకొని సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలు పక్కాగా అమలయ్యేల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొన్ని గ్రామాలలో కొంతమంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అమలు అవ్వని పక్షంలో వారందరికీ సహాయ సహకారాలు అందించి సంక్షేమ మరియు అభివృద్ధి ఫలాలను వారికి అందజేయాలన్నారు. అటవీ ప్రాంతం ఉన్న గ్రామాలలో అటవీ హక్కుల చట్టాలను అమలు చేసి గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు, గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద లబ్ధిదారులకు ఇచ్చే కార్డులు అందని వారికి అందేలా చేయాలన్నారు. కిసాన్ సమాన్ నిధి పథకానికి సంబంధించిన లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించి గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నయనానందకరం ఒంటిమిట్ట శ్రీ కోదండరాముని పుష్పయాగం

**ఒంటిమిట్ట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త**

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో మంగళవారం సాయంత్రం పుష్పయాగ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారి మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన చేపట్టారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం వైభవంగా ప్రారంభమైంది. తులసీదళాలు, మల్లెలు, రోజా, చామంతి, గన్నేరు, సంపంగి, మొగలి దళం తదితర పుష్పాలు, పత్రాలతో స్వామి, అమ్మవారికి పుష్పనీరాజనం సమర్పించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి 2.5 టన్నుల పుష్పాలు విరాళంగా అందాయి. ప్రకృతి వైపరీత్యాల నుంచి భక్తులను కాపాడాలని స్వామివారిని ప్రార్థిస్తూ, భూమాతను ప్రసన్నం చేసుకునేందుకు శ్రీవైష్ణవాలయాలలో పుష్పయాగం నిర్వహిస్తారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాల్లో గానీ, నిత్యకైంకర్యాల్లో గానీ తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ యాగం నిర్వహణ వల్ల సమస్తదోషాలు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నటేష్ బాబు, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, టిటిడి వేద పండితులు, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.






# కూచివారిపల్లె సీతారాముల కళ్యాణంలో జగన్ రాజు

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త**

రాజంపేట మండలం కూచువారిపల్లె గ్రామస్తుల ఆహ్వానం మేరకు సోమవారం రాత్రి సీతారాముల కళ్యాణంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు హాజరయ్యారు. ముందుగా సీతారాముల స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చమర్తి జగన్మోహన్ రాజుకు ఆలయ కమిటీ ,గ్రామస్తులు దృశ్యాలువాతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నేత కావటూరి సుబ్రహ్మణ్యం (మణి ), అమ్మినేని వెంకటయ్య, గోనిగుంట్ల మల్లికార్జున నాయుడు, దగ్గుబాటి వెంకటేశ్వర్లు, బాలాజీ, వెంకటయ్య, పార్టీ గ్రామీణ అధ్యక్షుడు పార్టీ గ్రామీణ అద్యక్షుడు సుబ్బనరసయ్య నాయుడు, నెట్టెం శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ముఖ్య నాయకులు గ్రామస్తులు ఆలయ కమిటీ మరియు మహిళలు పాల్గొన్నారు.



కూచివారిపల్లె సీతారాముల కళ్యాణం లో జగన్మోహన్ రాజు, మణి




మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌కి వస్తున్న

# ప్రజాదరణ చూసి ఓర్వలేక అసత్యరోపణలు

**లక్కిరెడ్డిపల్లి : ఏప్రిల్ 15 ప్రభాతవార్త**

రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు ఆయన కుటుంబ సభ్యుల పై అసత్య ఆరోపణలు చేయడం తగదని లక్కిరెడ్డిపల్లి మండల నాయకుడు యనమల మదనమోహన్ తెలియజేశారు. లక్కిరెడ్డిపల్లి స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యనమల మదన్మోహన్ మాట్లాడుతూ ఎవరో కంకర తీసుకొనిపోతే అది మంత్రి వారి కుటుంబ సభ్యులపై, ఆరోపణలు చేయడం తగదన్నారు. మంత్రిపై ఆరేపించడం వీరభద్ర స్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు మా మంత్రి అవసరం లేదు మేము సిద్ధం 2024 ఎన్నికల్లో నువ్వు వైసీపీ నుంచి 11 కోట్లు డబ్బులు తీసుకున్నావని వీరభద్ర స్వామి ఆలయంలో ప్రమాణం చేసేందుకు మేము సిద్ధం...మా నాయకుడు 40 లక్షలు తీసుకున్నాడని నువ్వు ప్రమాణం చేయడానికి సిద్ధమా? అని ప్రశ్నించారు. మా నాయకుడు నీతి, నిజాయితీ గురించి మీరు మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా కూడా మీ పనులు మీరు చేసుకుంటూ పోతున్నారు. మా నాయకుడు ఎవ్వరి కాళ్లు పట్టుకుని టికెట్ తెచ్చుకోలేదు. ప్రజా ఆదరణ, సమర్థవంత నాయకుడు కాబట్టే చంద్రబాబు నాయుడు మా నాయకుడికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. వైసిపికి పంచుకోటగా ఉన్న రాయచోటి ప్రజలు మా నాయకుడికి ఓట్లు వేసి గెలిపించారు. మంత్రి చేపట్టే అభివృద్ధి ని చూసి ఓర్వలేకనే రమేష్ కుమార్ రెడ్డి అసత్య ఆరోపణ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏపిఐసిసి చైర్మన్ ఎర్రగుడి చంద్రశేఖర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కొండూరు వెంకట్రామ రాజు, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీ నాయక్, షేక్ ఆరీఫ్, జయరాం ,సిద్ధక వెంకటరామిరెడ్డి, మల్‌రెడ్డి, ఉమా మహేశ్వర్ రెడ్డి, రామాంజనేయులు, మూగి వెంకటరమణ, కావలి ఆంజనేయులు, వొట్టికాళ్ల వెంకటరమణ, సయ్యద్ మసూద్ , మల్లి , తెలుగుదేశం పార్టీనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ మండల నాయకులు మదన్ మోహన్










## ఆణిముత్యాలు

**వాల్మీకిపురం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:**

ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో పట్టణంలోని తరిగొండ రోడ్డులోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల విద్యార్థులు ఉర్దూ మీడియంలో ఉత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ రమామంజుల తెలిపారు. రెండవ సంవత్సరం ఎంపిసిలో షాను 933, బైపిసిలో సైదాబాను 961, సిఇసిలో అర్షియా షబ్రీన్ 865 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. అలాగే మొదటి సంవత్సరం ఎంపిసిలో అఫీషా 410, బైపిసిలో సనా 400, సిఇసిలో మిను 442 మార్కులు సాధించినట్లు తెలిపారు.





కంకర దొంగలను పట్టుకోకుండా

## ఆర్ఆర్ కుటుంబంపై విమర్శలు చేయడం తగదు



**లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్ 15 ప్రభాతవార్త:**

కంకర దొంగలను పట్టుకుని వారికి బుద్ధి చెప్పాల్సింది పోయి , వారిని వెనకేసుకొస్తు ఆర్ ఆర్ కుటుంబాన్ని విమర్శించే స్థాయికి దిగజారడం నీతి మాలిన చర్య అని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆర్ ఆర్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మా నాయకుడు ఆర్ రమేష్ కుమార్ రెడ్డి 11 కోట్లు తీసుకోలేదని రాయచోటి వీరభద్ర స్వామి గుడిలో మీడియా సమక్షంలో ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మీ మంత్రి రాంప్రసాద్ రెడ్డి 2019 ఎన్నికల్లో వైసిపి పక్కన ఉంటూ టిడిపికి సపోర్ట్ చేస్తానంటూ మా నాయకుడు రమేష్ రెడ్డి కుటుంబ సభ్యుల 40 లక్షల రూపాయలు తీసుకోలేదని ప్రమాణం చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. అప్పట్లో వెలుగల్లు ప్రాజెక్టుకు పునాది రాయి వేసి అక్కడ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలు కరువు నుండి బయటపడతారనే సంకల్పంతోనే ప్రాజెక్టును ఆ రెండు కుటుంబాల వారు దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో పూర్తిచేసి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ఈ ప్రాంత ప్రజలకు తాగునీరు,సాగునీరు అందించిన ఘనత వారికే దక్కుతుందన్నారు. జిల్లా ఎస్పీ చొరవ చూపి కంకర దొంగతనానికి పాల్పడిన వారి పై కేసులు నమోదు చేసి, చట్టం ఎవరు చుట్టం కాదని చట్టపరిధిలో అధికారం ఉన్నా, లేకున్నా అందరూ సమానమే అనేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కా ర్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు అంబాబత్తిన రెడ్డెయ్యా , ఉపాధ్యక్షుడు సిద్ధక రామచంద్రా రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సర్పం చ్ వెంకటనారాయణ రెడ్డి, చంద్రాయుడు, గడ్డం ప్రభాకర్ రెడ్డి, కేశవయ్య, ఎంపీటీసీ రమణమ్మ, మూగి శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ రాజేంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్సీపీ యూత్ నాయకులు కాలాడి వినయ్ కుమార్ రెడ్డి, మైనార్టీ నాయకులు చాన్ భాషా, జాకీర్, సీఎం బాషా, ఖాజా,టెంకాయల బాషా, అన్వర్, బాబ్జాన్, నవాజ్, గౌస్ పీర్,మాజీ సర్పంచ్ లు భువనేశ్వర్ రెడ్డి, సుబ్బరాజు,దుర్గయ్య, పీలం నాగేంద్ర, రెడ్డెన్న, తదితరులు ఉన్నారు.

## గ్రామ పంచాయతీ అవినీతి జలగల పై విచారణ లో జాప్యం తగదు



**వేంపల్లి: ఏప్రిల్ 15 (ప్రభాత వార్త):**

వేంపల్లి గ్రామపంచాయతీ లో అవినీతి అక్రమాలకు పాల్పడి పెద్ద మొత్తంలో ప్రజా ధనాన్ని భోంచేసిన అవినీతి జలగలపై విచారణలో జాప్యం తగదని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరి ప్రసాద్. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మునగాల చంద్ర అధికారులను కోరారు ఈ మేరకు వారు పులివెందుల డిఎల్పిఓ రమాదేవిని కలిసి మాట్లాడారు. 2019, 2022 మధ్య కాలంలో అప్పటి ఈఓ, ఓ జూనియర్ అసిస్టెంట్ లు కలసి నీటి పన్ను, ఇంటి పన్ను, ఇంటి యజమానుల పేర్లు మార్పు, కొత్త ఇళ్ల నిర్మాణ ప్లాన్ అప్రూవల్స్ ల విషయంలో దొంగ బిల్లులు ఫొర్జరీ సంతకాలతో ప్రజలనుంచి లక్షలు వసూలు చేసి దిగమింగారని అన్నారు. ఈ విషయం అప్పట్లో సదరు అధికారులు 60 లక్షలకు పైగా ప్రజల డబ్బులు దిగమింగేసారని వెలుగు చూసిందన్నారు. ఇటీవల అవినీతి ఆరోపణలపై గ్రామపంచాయతీ ఈవో సస్పెండ్ అయ్యారని, అవినీతిలో పాత్ర ఉన్న అప్పటి ఈవో ను ఉన్నతాధికారులు చక్రాయపేటకు సాగనంపారని వారు పేర్కొన్నారు. పంచాయతీలో పనిచేసిన అప్పటిఈవో, జూనియర్ అసిస్టెంట్ అవినీతి పై డి ఎల్ పి ఓ కి వ్రాత పూర్వకంగా ఫిర్యాదు చేయగా విషయమై వారిరువురిపై విచారణ జరిపేందుకు పులివెందుల డి ఎల్ పి ఓ రమాదేవి ని విచారణ అధికారిగా నియమించదని అన్నారు ఇప్పటి వరకు ఆ విచారణ ముందుకు సాగలేదన్నారు. విచారణలో జాప్యం జరగడం వల్ల అవినీతి అధికారులు సర్దుబాటు చేసుకుంటారని, మరోవైపు ఈ విషయంలో ప్రజల్లో నిక్కచ్చి అదికారులైన మీలాంటి వారిపై దురభిప్రాయం ఏర్పడుతుందన్నారు. ఈ పంచాయతీలో పెద్ద ఎత్తున అవినీతి చేసిన జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ మాత్రం వేంపల్లి పంచాయతీ కార్యాలయం లో తిష్ట వేసి ప్రజల వద్ద అందినకాడికి దోచుకుంటున్నారని చెప్పారు. సత్వరం విచారణను ప్రారంభించి అవినీతి అధికారులను ఇంటికి సాగనంపాలని కోరినట్లు తెలిపారు. భవిష్యత్తు లో ఎవరూ కూడా అవినీతి చేయాలంటే బయపడేవిధంగా చర్యలు తీసుకునేలా విచారణ సాగించాలని కోరినట్లు చెప్పారు. వేంపల్లి కు కొత్త ఈవో వచ్చిన తరువాత జమ్మలమడుగు నుంచి రికార్డులు తెప్పించి విచారణ పారదర్శకంగా చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డిఎల్పిఓ రమాదేవి హామీ ఇచ్చినట్లు తెలిపారు. పివిఎల్. డి ఎల్ పి ఓ రమాదేవితో మాట్లాడుతున్న గాలి హరిప్రసాద్.

## కందుల శివ్వానదరెడ్డి చిరస్మరనీయుడు

**వేంపల్లి: ఏప్రిల్ 15 (ప్రభాత వార్త):**

జీవ రాసులలో మానవ జన్మ చాలా గొప్పదని అటువంటి జీవితంలో శివానంద రెడ్డి చేసిన సేవలు మరువలేనివని అందుకే ఆయన చిరస్మరనీయుడని పీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి అన్నారు.వేంపల్లి లోని కందుల ఓబుళరెడ్డి చారిటీస్ ఐటి ఐ లో కందుల శివానందరెడ్డి 76 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు శివానందరెడ్డి చిత్ర పటానికి అహుతులు సిబ్బంది విద్యార్థులు పుష్పాంజలి తో నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశం లో తులసిరెడ్డి మాట్లాడుతూ శివానందరెడ్డి వ్యక్తి త్వం చాలా గొప్ప దని మితభాషి అని నిగర్వి అని కొనియాడారు. ఏ పార్టీ లో వున్న ఉన్నత స్థానం లో వున్నారని అజాత శత్రువు అని పేర్కొన్నారు. విద్యా వ్యాపార పారిశ్రామిక రాజకీయ రంగాలలో ప్రత్యేక స్థానం అని చెప్పారు. పుట్టిన ప్రతి వ్యక్తి గిట్టక మానదని అయితే తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు నిలుపుకోవాలని అందుకే శివానందరెడ్డి చిరస్మరనీయుడని తులసిరెడ్డి పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ప్రసాదరావు మాట్లాడుతూ అరుదైన వ్యక్తిత్వం గల నాయకుడు అని అటువంటి సంస్థ లో వున్నందుకు గర్వపడుతున్నా మని అన్నారు. కళాశాల ల యాజమాన్యంల లో శివానందరెడ్డి ప్రత్యేక స్థానం అని కొనియాడారు. ఇంకాటి. వెలమ వారి పల్లి మాజీ సర్పంచ్ రహీం అమర్ నాథ్. ప్రభాకరనాయుడు. విజయభాస్కర్. చంద్రశేఖర్ ఉత్తమరెడ్డి. వెంకటరెడ్డి. మార్కయ్య. ఆది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం రాజీవ్ కాలనీ లో గల వృద్ధ ఆశ్రమం లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



## గాజు వ్యర్థాలతో అందమైన కళారూపాలు

**భూమిపై పెరిగిపోతోన్న వ్యర్థాల్లో.. ప్లాస్టిక్ కాదు.. గాజు శాతమూ ఎక్కువే. పైగా ఇవి మట్టిలో కలవడానికి వేల ఏళ్ల పడుతుందట. ఈ విషయమే నోయిడాకు చెందిన మాధురీ బాలోడీని ఆలోచించచేసింది.** దీంతో పెద్దఎత్తున పోగవుతోన్న ఈ సీసాలను సేకరించి అప్‌సైక్లింగ్ ఆర్ట్ ప్రొడక్ట్స్ తయారు చేస్తున్నారు. వాటిని దేశవిదేశాలకు ఎగుమతి చేస్తూ ఆదాయం అందుకుంటున్నారు. మరెంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

మాధురి బాలోడీది నోయిడా. అక్కడే పుట్టిపెరిగారామె. స్కూలు, కాలేజీ రోజుల్లో తను సాధారణ వద్యార్థే అయినా.. భవిష్యత్తుని వ్యాపార రంగంలో నిర్మించుకోవాలన్న తపనే తనని ఐఐఎమ్ బిజినెస్ స్కూల్లో పాఠాలు వినేలా చేశాయి అంటారామె. మనదేశంలోనే ఏటా మూడు విలియన్ టన్నుల గాజు వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటిల్లో 40 శాతం మాత్రమే రీసైక్లింగ్ అవుతున్నాయి. మిలిగినవి వ్యర్థాలుగా మారిపోతున్నాయి. ఈ విషయం తెలిశాక.. గాజుని పునర్వినియోగించే మార్గాలను వెతికా. ఇందుకోసం అప్పటికే మీడియా రంగంలో పనిచేస్తున్న నేను ఉద్యోగాన్నీ వదిలేశా అని చెబుతారు మాధురి. స్నేహితుడు అమిత్ సింగ్‌తో కలిసి 2012లో ఆవిడ పొయెట్రీ ఆర్ట్ ప్రాజెక్ట్‌ని ఆరంభించారు. కాస్త సృజన, అభిరుచి ఉండాలే కానీ, ఏవస్తువునైనా అద్భుతమైన కళాఖండంగా మార్చేయొచ్చు. ఇందుకోసం చెత్త సేకరించే వ్యక్తులూ, డీలర్లను సంప్రదించారు. బెంగళూరు, హైదరాబాద్, ముంబయి, కేరళ వంటి అనేక





రాష్ట్రాల నుంచి వీటిని సేకరిస్తున్నారు. ఆపై వాటిని శుభ్రం చేసి చూడముచ్చటైన ఆర్ట్‌పీస్‌లుగా, కిచెన్ ఐటెమ్స్‌గా తీర్చిదిద్దుతున్నారు. వాటిల్లో ల్యాంప్‌లు, క్రాఫ్ట్ క్లాక్‌లు, వాల్ ఆర్ట్ బ్యాగులు, ప్లాంటర్లు వంటివెన్నో ఉన్నాయి. అంతేనా, 140 టనునల వ్యర్థాలను వినియోగవస్తువులుగా మార్చినందుకు 'లిమ్కాబుక్ ఆఫ్ రికార్డ్స్'లోనూ స్థానం సంపాదించుకున్నారు. ఈ ప్రొడక్ట్స్‌ని కస్టమైజ్డ్ గిఫ్ట్‌లుగా, కార్పొరేట్ కానుకలుగానూ అందిస్తున్నారు. టాటా, బాంబే సాఫైర్, ఫెర్నార్డ్ రిచర్డ్, డిఎల్ఎఫ్, మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్, టాటా, అమెజాన్, గ్రాండ్ హయత్‌వంటి వెయ్యికిపైగా ప్రముఖ సంస్థలెన్నో కవి ప్రాజెక్టుకి



క్లయింట్లుగా ఉన్నాయి. మార్పు కోసం ఆలోచిస్తే సరిపోదు. ముందు మనమే మారాలి అనే మాధిరి ప్రస్తుతం దేశంలోని యూఎన్‌డిపి సస్టైనబుల్ స్టార్టప్స్‌కి మెంటార్‌గానూ వ్యవహరిస్తున్నారు.

## ప్రధాని చేతులమీదుగా అవార్డు

**పట్టుమని పది నిమిషాల్లో సంప్రదాయ వంటల్నీ, క్షణాల్లో స్ట్రీట్ చాట్స్‌నీ వండి వడించేయగలదు. అతి తక్కువ దినుసులతో ఈమె చేసే వంటకాలకు కోట్లమంది ఫిదా అవుతున్నారు. అందుకే ఈ ఏడాది బెస్ట్ క్రియేటర్‌గా ప్రధాని మోదీ చేతులమీదుగా అవార్డునీ అందుకుంది. తాజాగా ఫోర్బ్స్ పట్టికలోనూ స్థానం సంపాదించింది 41 ఏళ్ల కబితాసింగ్.**

ఉత్తర, దక్షిణాది వంటకాలన్నీ సులువుగా చేయడం అమ్మ నుంచి నేర్చుకున్నాను అని చెప్పే కబితాసింగ్‌ది పుణె. చిన్నప్పటి నుంచి వంటపై ఆసక్తి. తల్లికి వంటగదిలో సాయాన్నీ అందించేది. ఆ తర్వాత చదువు, ఉద్యోగంతో బిజీ అయ్యింది. 2009లో పెళ్లై భర్తతో లండన్ వెళ్లడంతో కబితాసింగ్‌కు ఉద్యోగంలో విరామం దొరికింది. కొత్త వంటకాలను నేర్చుకోవడం మొదలుపెట్టా. అయిదేళ్ల తర్వాత ఇండియాకు తిరిగొచ్చాం. మా అబ్బాయి స్కూల్‌కెళ్లిన తర్వాత నాకు మళ్లీ సమయం దొరికింది. తిరిగి ఉద్యోగానికి వెళ్లదమంటే బాబు సంరక్షణ చూసుకోవాలి. దాంతో నా చిన్నప్పటి అభిరుచికి పెద్దపీట వేసి వంట వీడియోలు చేయాలను కున్నా.2014లో 'కబితాస్‌కిచెన్' పేరుతో యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించా. వంట పరిచయం లేనివాళ్లకు అర్థమయ్యేలా వంట చేసి చూపించడంతోపాటు, వాళ్లడిగే సందేహాలూ తీర్చేదాన్ని. ఆ తర్వాత వాళ్ల నుంచి ఫీడ్‌బ్యాక్, సలహాలు తీసుకుంటూనే, వాళ్లు కోరిన వంటకాలు చేసిచూపించేదాన్ని. సీజన్‌కు తగిన, పండగలకు సంబంధించిన వాటినీ వీడియోల్లో జత చేస్తుంటా. అలాగే ట్రెండింగ్‌లో ఉన్నవాటితోపాటు కొన్ని ప్రత్యేక వంటకాలు చేసి వారానికి మూడు వీడియోలు పోస్ట్ చేసేలా ప్రణాళిక వేసుకున్నా. అలా మా వంటింట్లోనే మొదట ఫోన్ కెమెరాలో నేను తీసిన వీడియోలకు అభిమానులు పెరిగారని గురునత చేసుకుంటుందీమె.

**స్థానాన్ని దక్కించుకుని....** కబితాసింగ్ తన వంటకాలతోపాటు సబ్జీ, చికెన్, పావ్‌బాజీ మసాలాలను తయారుచేసి ప్రచారమైన చేస్తోంది. దీనికి దేశవ్యాప్తంగా మార్కెట్‌లో మంచి స్పందన వచ్చింది. అంతేకాదు, వంటింట్లో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వంటి చిట్కాలు, ప్రతి పదార్థాన్ని వృథా కాకుండా నిల్వ చేయడమెలాగో కూడా చెబుతోందీమె. మొదట్లో వ్యాపారవేత్తగా ఉన్నా



క్రమేపీ నయా ఆలోచనలతో కంటెంట్ క్రియేటర్‌గా మారిన కబితాసింగ్ ఈ ఏడాది ఫుడ్ క్యాటగిరిలో 'బెస్ట్' క్రియేటర్ అవార్డును ప్రధాని మోదీ చేతులమీదుగా అందుకుంది. తాజాగా ఫోర్బ్స్ క్రియేటర్స్ పట్టికలో స్థానాన్నీ దక్కించుకుంది. ప్రస్తుతం ఈమె వంట వీడియోలకు యూట్యూబ్‌లో 1.39 కోట్లమంది సబ్‌స్క్రైబర్లు, ఇన్‌స్టాలో కోటి మంది ఫాలోయర్లున్నారు. మనసుకు నచ్చింది చేస్తే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అప్పుడు ఏ రంగంలోనైనా విజయం దరిచేరుతుంది. అంతేకాదు, అది మరికొందరికి మనల్ని స్ఫూర్తిగా నిలబెడుతుందని చెబుతుందీమె.

## తనయుని విజయం వెనుక తల్లి !

**క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్‌లనూ ఆడగల క్రికెటర్! ప్రపంచంలోని అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో ఒకడు. యార్కర్, బౌన్సర్, ఇన్‌స్వింగ్, ఔట్‌స్వింగ్.. అంటూ ఈ భారత ఫాస్ట్ బౌలర్ తన అమ్ములపొదిలోని అస్త్రాలతో.. ప్రత్యర్థికి చెమటలు పట్టించేస్తాడు. తాజాగా తన సూపర్ బౌలింగ్‌తో టీ20 2024 ప్రపంచకప్ పోటీల్లో టీమిండియాను ఛాంపియన్‌గా నిలిపాడు..**

**జస్‌ప్రీత్ బుమ్రా. అయితే, క్రికెటర్‌గా అతను రాణించడం వెనక.. తల్లి దల్జీత్‌కౌర్ పాత్ర ఎంతో!**

పిల్లలు పసివాళ్లుగా ఉన్నప్పుడే భర్త జస్వీర్ సింగ్‌ని కోల్పోయారు దల్జీత్ కౌర్. అహ్మదాబాద్‌లో స్థిరపడిన పంజాబీ సిక్కు కుటుంబం వారిది. భర్తను పోగొట్టుకుని పుట్టెడు బాధలో ఉన్న కోడలిని చేరదీయాల్సిన బుమ్రా తాత సంతోక్ సింగ్ ఊరొదిలి వెళ్లిపోయాడు. దాంతో వారి జీవితం తలకిందులైంది. దల్జీత్ ఆ షాక్ నుంచి చాన్నాళ్లు కోలుకోలేకపోయారు. ఆర్థిక ఇబ్బందులతో బిడ్డలకు మూడుపూటలా భోజనమూ పెట్టలేని పరిస్థితి. అది గమనించిన దల్జీత్ స్నేహితురాలు దీపల్ నెలరోజులపాటు.. బుమ్రా, వాళ్లక్క జుహికా సంరక్షణ బాధ్యతని తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు అప్పటివరకూ గృహిణిగా ఉన్న దల్జీత్ గడపదాటి బయటకు రాక తప్పలేదు. కుటుంబ పోషణ కోసం టీచర్‌గా మారారు. కొన్నేళ్లలోనే ప్రిన్సిపల్ హోదానీ అందుకున్నారు. దీంతోపాటు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తూ.. రోజుకు 16 నుంచి 19 గంటలు కష్టపడేవారు. పిల్లలకి ఏ లోటూ రాకుండా చేసుకుంటూ వాళ్లకి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించారు.

**ఆ శబ్దం విసుగు తెప్పించడంతో...** తల్లి ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న స్కూల్లోనే బుమ్రా ప్రాథమిక విద్య సాగింది. జస్‌ప్రీత్‌కి చదువు మీద పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. క్రికెటర్ కావాలని కలలు కనేవాడు. దల్జీత్ కూడా కొడుకు ఇంజినీరో, డాక్టరో అవ్వాలని ఒత్తిడి తేలేదు. నీ మనసు మాట విను.. కానీ, ఆంగ్ల భాషపై పట్టు సాధించమని మాత్రం చెప్పారట. రెండుమూడు భాషల్లో నైపుణ్యం ఉంటే ఏ వృత్తిలోనైనా ఎదగొచ్చనేది ఆమె నమ్మకం. టివిలో ఫాస్ట్ బౌలింగ్ చూసి రబ్బరు బంతిని గోడకు కొట్టి బౌలింగ్ సాధన చేసేవాడు బుమ్రా. అయితే,రోజూ ఆ శబ్దం దల్జీత్‌కి విసుగు తెప్పించేదట. దాంతో ఓ రోజు తక్కువ సౌండ్ వచ్చేలా ఆడుకోగలిగితేనే ఇంట్లో ఆడమని బుమ్రాకు చెప్పారట. అలా అమ్మ కోపానికి గురవ్వకుండా ఉండేందుకు కనిపెట్టిన టెక్నిక్కే.. అతడి కెరియర్‌ని మలుపు తిప్పింది. బంతిని ఫ్లోరింగ్, గోడ కలిసే చోట వేసి శబ్దాన్ని నియంత్రిస్తూ నేర్చుకున్న తొలిపాఠంతోనే షార్ప్‌గా యార్కర్లు వేయగలుగుతున్నానంటాడు బుమ్రా.



**అప్పుడు ఎంతగానో బతిమాలాడు...** మొదట్లో క్రికెట్‌లో రాణించగలడో లేదో అని భయపడ్డ. గుజరాత్ అండ్ 16లో ప్రతిభ చూపించినా.. అండర్ 19కి ఎంపిక కాకపోవడం బాధ కలిగించింది. దాంతో ఇక క్రికెట్ వదిలేయమన్నా. తిరిగి చదువుపై దృష్టిపెట్టి ఉద్యోగం సంపాదించమని కోరా. నా మాట కాదనలేకపోయాడు. కొన్నాళ్లు అలానే చేశాడు. కానీ, వాడి మనసు మాత్రం క్రికెట్‌మీదే ఉండేది. అందుకే, తిరిగి నన్ను ఒప్పించాలని పదే పదే ప్రయత్నించేవాడు. నేనూ ఇక వాడి ఆసక్తి చూసి సరేనన్నా. అది మొదలు వాడి దశ తిరిగింది. ముంబై ఇండియన్స్ ఐపిఎల్ జట్టులో సభ్యుడిగా తరవాత మరెన్నో దేశీయ, అంతర్జాతీయ మ్యాచుల్లో ఫాస్ట్ బౌలర్‌గా తన ప్రతిభ చూపించాడు. అయితే, నన్నో విషయం ఇప్పటికీ బాధపెడుతుంది. అప్పట్లో ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఆరంభంలో బూమ్రాకు ఓ నాణ్యమైన క్రికెట్ కిట్‌ని కూడా కొనలేకపోయా. నన్ను అర్థం చేసుకుని ఉన్న ఒక జత షూ, టీషర్టులనే ఉతుక్కుని ప్రాక్టీస్ చేసేవాడు. చిన్నప్పటి నుంచీ నా కొడుకు సిగ్గరి. ఏ విషయమైనా నాతో చెప్పనిదే, నా అనుమతి లేనిదే ముందుకెళ్లేవాడు కాదు అంటే తన బిడ్డ గురించి చెప్పి మురిసిపోతారు దల్జీత్. తాజాగా బుమ్రా ఐసిసి టి 20 ప్రపంచకప్ పోటీల్లో ఆటను మలుపు తిప్పడమే కాదు.. 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ గెలుచుకున్నాడు. అమ్మ లేకపోతే క్రికెటర్‌గా నాకు కెరియర్ లేదంటాడు బుమ్రా. ' క్లిష్ట సమయాల్లో స్థితప్రజ్ఞత, సమయ పాలన పాటించడం ఎలానో తల్లి నుంచే నేర్చుకున్నానీ, అమ్మే తన స్ఫూర్తి అని



అంటారు. 'నేనీ స్థితిలో ఉండటానికి నా తల్లి చేసిన త్యాగాలెన్నో. తనకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేను. జీవితాంతం ఎలాంటి కష్టం కలగకుండా చూసుకోవడం తప్ప..! మ్యాచ్‌కి ముందు వీలైతే అమ్మను కలుసుకోవడం, లేదంటే ఫోన్లో మాట్లాడడం. సెంటమెంట్ అని చెబుతాడు ఈ టీమిండియా పేసర్. 2021లో స్పోర్ట్స్ ప్రెజెంటర్ సంజనా గణేశన్‌ను వివాహం చేసుకున్నాడు. ఈ జంటకు ఒక అబ్బాయి.

## జుట్టూడకుండా జాగ్రత్తలు..



**చిన్న వయసులోనే జుట్టూడిపోవడం అన్నది ఈ మధ్య కామనైపోయింది. ఇందుకు కారణాలెన్నో. అయితే ఎవరికి గత్తలు తీసుకున్నట్లయితే జుట్టూడిపోకుండా కొంతవరకు కాపాడుకోవచ్చు. ఈ క్రమంలో జుట్టు ఆరోగ్యానికి పాటించాల్సిన కొన్ని చిట్కాల గురించి తెలుసుకుందాం..**

◆. శరీరానికి హెల్దీ లైఫ్‌స్టైల్ ఎంత అవసరమో..శిరోజాల సంరక్షణకు కూడా ఆరోగ్యకరమైన జీవనశైలి తప్పనిసరి ఇందులో భాగంగా మంచినీళ్లు ఎకునకవగా తీసుకోఅలి. దీనివల్ల శరీరంలో నీటి స్థాయులు పెరగడమే కాకుండా చరనమంలోని మలినాలు, వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి.



ఫలితంగా జుట్టుకూడా ఆరోగ్యాన్ని సంతరించుకుంటుంది. అవసరమైతే వైద్యులను సంప్రదించి విటమిన్ సప్లిమెంట్స్ తీసుకోవాలి.

ఇందులోని పోషకాలు జుట్టు ఆరోగ్యంగా ఉండడానికి సహకరిస్తాయి.

◆. జుట్టు బాగా ఆరోగ్యంగా పెరగాలంటే క్రమం తప్పకుండా హెయిర్‌ను ట్రిమ్ చేసుకోవాలి.

◆ తలస్నానానికి బాగా వేడిగా ఉండే నీళ్లు ఉపయోగించడం వల్ల జుట్టు కుదుళ్లను నష్టం కలుగుతుంది. కాబట్టి గోరువెచ్చని నీటినే తలస్నానానికి ఉపయోగించాలి. వెంట్రుకలు దృఢత్వాన్ని సంతరాంచుకోవాలంటే స్నానం తర్వాత కండిషనర్‌ను రాసుకోవడం తప్పనిసరి.

◆ స్నానం చేసిన తర్వాత సాధ్యమైనంతవరకు జుట్టును సహజంగానే ఆరనివ్వాలి. వేడి కలిగించే హెయిర్ డ్రయర్స్‌ను అధికంగా వాడడం వల్ల కుదుళ్లలో దురద, అలర్జీలు జుట్టు చివర్లు చిట్లడం.. వంటి సమస్యలు తలెత్తుతాయి. అలాగే తలస్నానం చేశాక జుట్టుకు తుడుచుకునేందుకు రెగ్యులర్ టవల్ బదులు మైక్రోఫైబర్ ర్యాపర్స్‌ను వినియోగిస్తే మేలు.

◆. తలస్నానం చేసిన వెంటనే జుట్టును దువ్వకూడదు. అలా చేస్తే వెంట్రుకలు తెగిపోవడం, ఎక్కువ జుట్టు రాలిపోవడం. వంటి సమస్యలొస్తాయి. జుట్టు దువ్వకోవడానికి కూడా మెత్తటి బ్రిజిల్స్ ఉండే దువ్వెనను ఉపయోగించడం ఉత్తమం.

◆ చల్లటి ప్రదేశాలకూ వెళ్లినప్పుడు ఉన్నితో తయారుచేస్తే టోపీలతో జుట్టును కవర్ చేయడం ఉత్తమం లేకపోతే చల్లటి గాలులు కురులకు నష్టం కలిగిస్తాయి.

◆. కేశ సౌందర్య సమస్యలన్నింటినీ దూరం చేసుకుని ఆరోగ్యకరమైన జుట్టును సొంతం చేసువాలంటే మసాజ్ మించిన సాధనం లేదా కాబట్టి కనీసం వారానికోసారైనా హెయిర్ మసాజ్ చేసుకోవాలి. మసాజ్‌నుమించిన సాధనం లేక ఏమీ లేదు.

## ఉద్యోగం మారాల్సిందేనా?

**నచ్చిని చోట, ఉన్నతి లేని చోట పనిచేయడం కంటే ప్రత్యామ్నాయం వెతుక్కొని కెరీర్‌లో అభివృద్ధిని సాధించడం ఇటు వ్యక్తిగతంగా, అటు వృత్తిపరంగా మంచిదంటున్నారు. మరి, ఇంతకీ పని వాతావరణాన్ని నెగటివ్‌గా ప్రభావితం చేసే కొన్ని అంశాలేంటో తెలుసుకుందాం..**

**మిమ్మల్ని దూరం పెడుతున్నారా? ....** ఒక బృందం ప్రాజెక్ట్ మీద పని చేస్తోందంటే దానికి సంబంధించిన ప్రతి విషయం, ప్రతి అప్‌డేట్ ఆ గ్రూప్‌లో ఉన్న అందరికీ తెలిస్తేనే కలిసికట్టుగా ముందుకెళ్లగలం.. అనుకున్న సమయానికి చక్కటి అవుట్‌పుట్‌ని కంపెనీకి మార్పించవచ్చు. అయితే బాగా పనిచేసే వాళ్లపై ఇతర కొలీగ్స్‌కి ఉండే అసూయ, సహోద్యోగుల మధ్య కమ్యూనికేషన్ లోపం, గ్రూపిజం.. వంటి అంశాలు పని వాతావరణాన్ని దెబ్బతీస్తుంటాయి. ఇలాంటి చోట మీరు పని చేస్తున్నా, చక్కటి నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నా మిమ్మల్ని వేరు చేసి చూడడం, పనికి సంబంధించి మీకు ఎలాంటి అప్‌డేట్ చెప్పకపోవడం..వంటి అంశాలు మీ వ్యక్తిగత పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇది క్రమంగా మీ మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అంటే అంతిమంగా మీ కెరీర్ ఉన్నతికి గండి పడ్డటే! కాబట్టి ఇలాంటి వాతావరణంలో పనిచేస్తున్నప్పుడు మీ వెనక జరిగే గ్రూపిజం, ఆఫీస్ రాజకీయాల గురించి మీ తీరు గురించి ముందుగా పై అధికారులకు తెలియజెప్పే ప్రయత్నం చేయండి. అయిన లాభం లేదనుకుంటే అందులోనే వేరే విభాగానికి మారడం లేదంటే వేరే ఉద్యోగం వెతుకోనకవడం వల్ల కెరీర్ ముందుకెళ్లచ్చు.

**ఎంత చేసినా బూడిదలో పోసిన పన్నీరే!........** వచ్చిన ఉద్యోగం వచ్చింది. ఇక నా పనితనమేంటో చూపిస్తా.. అంటూఎంతో ఉత్సాహంగా తాము కోరుకున్న జాబ్‌లో జాయినవుతుంటారు చాలామంది. అయితే అక్కడికెళ్లి కొన్నాళ్ల పాటు ఉద్యోగం చేస్తే గానీ తెలియదు ఆ కంపెనీ పని వాతావరణం గురించి! ఈ క్రమంలో ఎంత పని చేసినా సరైన ప్రోత్సాహకాలు లేకపోవడం, కొన్ని కంపెనీల్లోనైతే పనిచేసే వారికంటే చేయని వారికే అధిక ప్రాధాన్యమిస్తూ వారికే పై అధికారుల నుంచి ప్రోత్సాహం లభించడం..వంటివి కూడా జరుగుతుంటాయి. అయితే ఇలాంటి వాతావరణం ప్రత్యక్షంగా మనం చేసే పనిపైన కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంటుంది. 'ఛ..ఛ.. ఎంత పని చేసినా బూడిదలో పోసిన పన్నీరే! అన్న భావన కలిగేలా చేస్తుంది. నిజానికి ఆ ఫీలింగ్ వచ్చిందంటే అలాంటి చోట పని చేయలేమని అర్థం. అందుకే అక్కడే రోజులు గడిపేయడం కాకుండా సత్వరమే వేరే ఉద్యోగంలోకి మారిపోవమే మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల ఆ సమయాన్ని వేరే కంపెనీలో కరీర్‌లో ఉన్నతి సాధించడానికి వినియోగించుకోవచ్చు.

**పనిభారమంతా మీదేనా ?...** చేసే ఉద్యోగమేదైనా సరే.. మనకు అప్పగించిన పనికే పరిమితం కాకుండా.. ఫలానా పనిని నేను చేయగలను అన్న ఆత్మవిశ్వాసంతో, యాక్టివ్‌గా ఆ పనిని స్వీకరించాలి.

## ముస్లింల పక్షపాతి వైఎస్ జగన్

### వైకాపా కన్వీనర్ నిస్సార్‌అహ్మద్


సమావేశంలో మాట్లాడుతున్న నిస్సార్‌అహ్మద్

**మదనపల్లె ఏప్రిల్ 15 ప్రభాతవార్త :**
ముస్లింల పక్షిపాతిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని మదనపల్లె నియోజకవర్గ కన్వీనర్ నిస్సార్‌అహ్మద్ తెలిపారు. మంగళవారం వైకాపా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెజార్టీ ముస్లిం మైనార్టీ ప్రజలు వ్యతిరేకిస్తున్న వక్ఫ్‌చట్ట సవరణ బిల్లు అమలను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. వక్ఫ్‌చట్టసవరణను వ్యతిరేకిస్తూ వైసిపి సుప్రీంకోర్టుకు వెళ్ళడం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బిల్లుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. పార్లమెంటులో కూడా వైసిపి ఈ బిల్లును వ్యతిరేకించిందన్న విషయం ప్రజలు గుర్తించుకోవాలన్నరు. వైసిపి ఎప్పుడూ మైనార్టీలకు అండగా ఉంటుందన్నారు. వక్ఫ్‌బిల్లులో కొన్ని అంశాలు వివాదస్పదంగా ఉన్నాయన్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఇప్పటికే కేరళ, తమిళనాడు,కర్నాటక, పశ్చిమబెంగాల్‌లో ముస్లిం సంఘాలు పెద్దఎత్తున నిరసనలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీకాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## వైభవంగా అంబేద్కర్ శోభాయాత్ర

**మదనపల్లె ఏప్రిల్ 15 ప్రభాతవార్త :**



భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో పట్టణంలో అంబేద్కర్ శోభాయాత్ర నిర్వహించారు. పట్టణంలోని మిషన్‌కాంపౌండ్ వద్ద బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్‌తో కలసి దళిత సంఘర్షణ సమితి (డిఎస్ఎస్) కర్నాటక రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేష్ జెండాఊపి ఈ యాత్రను ప్రారంభించారు. విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై అంబేద్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి శోభాయాత్ర నిర్వహించారు. చెక్కభజనలు, నృత్యప్రదర్శనలు, డప్పు, మేళతాళాలతో బాణసంచాపేల్చుతూ శోభాయాత్ర సాగింది. అంబేద్కర్ శోభాయాత్రకు పట్టణంలో ఘనస్వాగతం లభించింది.

## మతసామరస్యాన్ని దెబ్బతీయడానికే వక్ఫ్‌బిల్లు

### కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు ఎస్.కె.బాషా

**మదనపల్లె ఏప్రిల్ 15 ప్రభాతవార్త :**



మత సామరస్యాన్ని దెబ్బతీయడానికే వక్ఫ్ సవరణబిల్లు తీసుకువచ్చానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్‌కెబాషా తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం దేశంలోని హిందూ,ముస్లింల మద్య మతసామరస్యాన్ని దెబ్బతీయడం కోసమే వక్ఫ్‌బిల్లుకు సవరణ చేయడం జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా భారతీయులు అంతా ఒకటిగా నిలవాలన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తిరిగి కుల మతాల మద్య చిచ్చు రాజేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

## భర్తీకాని మార్కెట్‌యార్డు ఛైర్మెన్ పదవి

### నిరాశ చెందుతున్న ఆశావహులు

**మదనపల్లె ఏప్రిల్ 15 ప్రభాతవార్త :**


మార్కెట్‌యార్డు

రాష్ట్రంలోనే అతిపెద్ద టమోటా మార్కెట్‌యార్డుగా ఉన్న మదనపల్లె మార్కెట్‌యార్డుకు ఇంతవరకు ఛైర్మెన్ పదవిని నియామకం చేయలేదు. రాష్ట్రంలో సుమారు ఇప్పటి వరకు 70మార్కెట్‌యార్డుల వరకు ఛైర్మెన్ పదవిని ప్రభుత్వం నియమించింది. మదనపల్లె, తంబళ్ళపల్లె నియోజకవర్గాలకు చెందిన మార్కెట్‌యార్డులకు మాత్రం ఛైర్మెన్ పదవి నియామకాన్ని పెండింగ్‌లో పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు పైబడుతున్న ఇంతవరకు ఈ రెండు నియోజకవర్గాల్లో నామినేటెడ్ పదవుల నియామకాల్లో చర్యలు చేపట్టలేదు. పదవులు ఆశిస్తున్న ఆశావహులు నిరాశ చెందుతున్నారు. పక్క నియోజకవర్గాల్లో నామినేటెడ్ పదవులు భర్తీ అయిన విషయం తెలిసిందే. మదనపల్లె మార్కెట్‌యార్డు ఛైర్మెన్ పదవికి తెలుగుదేశం పార్టీతో పాటు బిజెపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు తీవ్రంగా పోటీ పడుతున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించిన వ్యక్తికే ఛైర్మెన్ పదవి వరిస్తుందంటూ పలువురు చెబుతున్నారు. ఇప్పటికే మార్కెట్‌యార్డు ఛైర్మెన్ పదవి కోసం పలువురు ధరఖాస్తులు చేసుకొన్నారు. ఇంకా ఆలయాలకు సంబంధించి కూడా నామినెటెడ్ పదవులు నియామకం చేయాల్సి ఉంది. ముఖ్యమంగా మడికయ్యల శివాలయం, శ్రీ ప్రసన్న వెంటకేశ్వరస్వామి ఆలయం, కనమలో గంగమ్మ ఆలయాలకు ఛైర్మెన్ పదవులు నియామకం చేయాల్సి ఉంది.

## కృత్రిమ మేధస్సుపై విద్యార్థులకు అవగాహన

**కురబలకోట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :**


వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న రీసోర్స్‌పర్సన్

రోబోలకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు వాటి సేవలను వినియోగించుకునేందుకు అవసరమైన సరికొత్త కృత్రిమ మేదస్సు పై విద్యార్థులకు రీసోర్స్‌పర్సన్ శస్త్రవేత్త బి.శ్రీనివాసులు అవగాహన కల్పించారు. మంగళవారం మిట్స్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ రోబోటిక్స్‌లో ఇటీవల ట్రెండ్స్‌పై వర్క్‌షాపులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు ఎన్నో పరిశోధనలు చేసి అభివృద్ధి చేశారని జాతీయ అభివృద్ధి భద్రత, పారిశ్రామిక ఆటోమేషన్ కోసం రోబోటెక్స్‌తో కృత్రిమ మైనస్‌ను అనుసందానించడం, ఆవిష్కరణ, పరిశోధన మరియు ఇంటర్ డిసిప్లినరీ లర్నింగ్ ద్వారా భారతదేశ సాంకేతిక పురోభివృద్ధికి తోడ్పడాలని విద్యార్థులను ఆయన ప్రోత్సహించారు. జనరేటింగ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రారంభ దశలోనే ఉందని సాంకేతిక అభివృద్ధి చెందుతూ మెరుగుపడుతున్న కొద్ది ప్రభావం పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ వర్క్‌షాపులో విద్యార్థులు,అధ్యాపకులు, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, కోఆర్డినేటర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## అనాతరైజెడ్ ఇళ్ళ క్రమబద్దీకరణకు సుగమం

**కురబలకోట, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :**


మండల సమావేశంలో ప్రసంగిస్తున్న దృశ్యం

ప్రభుత్వ స్థలాల్లో ఇండ్లు నిర్మించుకొన్న వారికి ప్రభుత్వం క్రమబద్ధీకరణచర్యలు చేపడుతోందని మండలమీట్‌లో కురబలకోట తహశీల్దార్ తపశ్విని తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపిపి భూదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ 2015కు ముందు ప్రభుత్వ స్థలాలు, డికేటి, తదితర చోట్ల ఇండ్లు నిర్మించుకొన్న పేదలకు క్రమబద్దీకరించేందుకు చర్యలు చేపడుతుందని అర్హులైన వారిని గుర్తిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం విద్యార్థుల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని హాజరు శాతం పెంచాలని ఎంఈఓ ద్వారకనాథ్ తెలిపారు. ముదివేడుక్రాస్, దాదంవారిపల్లె గ్రామాల్లో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నీటి సమస్య పరిష్కారం కోసం కొత్తగా బోర్లు డ్రిల్ చేశారని కరెంటు కనెక్షన్ ఇవ్వాలని ముదివేడు ఎంపిటిసి వైజి.సురేంద్ర అధికారులను కోరారు. చెరువులు, ఈ సమావేశంలో ఎంపిడిఓ గంగయ్య, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరి, ట్రాన్స్‌కో ఏఈ శంకర్‌రెడ్డి, పిఆర్ ఏఈ మదన్‌మోహన్‌రెడ్డి, వైస్ ఎంపిపి రమణారెడ్డి, జడ్పిటిసి జ్యోతి, సర్పంచ్‌లు ఆర్‌కె.క్రిష్ణారెడ్డి, పోరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, సుజాత, సోమిరెడ్డి, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

## సొంత నిధులతో కౌన్సిలర్ రోడ్డు నిర్మాణం

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త**



రాజంపేట పట్టణం మున్సిపాలిటీ పరిధిలోని 29 వార్డులో గత పదిహేళ్లుగా ప్రజలు ఇబ్బందులను గమనించిన స్థానిక కౌన్సిలర్ ఎస్‌ఎండి న్యామతుల్ల సొంత నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మించారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో విధిలేని పరిస్థితిలో న్యామతుల్లా సొంతంగా బుధవారం సిమెంట్ రోడ్ను పూర్తి చేశారు. దీంతో 29 వార్డులోని పోలా శ్రీమణి నగర్ ప్రజలు కౌన్సిలర్ న్యామతుల్లాను అభినందించారు.

## యువనాయకుడు గాంధీ రెడ్డి కనుమూత

**వాల్మీకిపురం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:**



వాల్మీకిపురం మండలానికి చెందిన యువనాయకుడు ఓబులంపల్లి గాంధీరెడ్డి( 52) మంగళవారం కన్నుమూశారు. మదనపల్లిలోని సమీప బంధువు ఇంటికి వెళ్లిన సందర్భంగా ఆయన అకస్మాత్తుగా గుండె పోటుకు గురై కుప్పకూలిపోయారు. గాంధీ రెడ్డి రెండు దశాబ్దాల క్రితం వాల్మీకిపురం మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. గాంధీ రెడ్డి మృతి పట్ల రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి,రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, వైసీపీ నాయకులు హరీష్ రెడ్డి,.నల్లారి శ్రీకర్ రెడ్డి, అబ్దుల్ కలీమ్,మొగ్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, పులి నరేంద్రకుమార్‌రెడ్డి సంతాపం తెలియజేశారు.

## ముస్లింల పక్షపాతి మాజీ ముఖ్యమంత్రి జగన్

**పులివెందుల,ఏప్రిల్15 ప్రభాతవార్త:**



ముస్లింల పక్షపాతి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని అందుకే, కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు బిల్లులను వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అత్యున్నత న్యాయస్థానంలో ముస్లింల కోసం పిటిషన్ వేయడం బట్టి ముస్లింలపై వైకాపాకు ఏ మేరకు చిత్త శుద్ధి ఉందో అర్థం అవుతుంది అని వైకాపాకు చెందిన ముస్లిం మత పెద్దలు అన్నారు. మంగళవారం పాత ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర నూర్ భాషా సంఘ అధ్యక్షులు రసూల్, జిల్లా వైసీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నూరుల్లా, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ ఖాదర్బాషా లు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ముస్లింల హక్కులను హరించి వేస్తోంది అని రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ వుందని ,రాజ్యాంగంలోని ఆర్టికల్ 15,16,24 25 ద్వారా కల్పించిన మత సంస్థల స్వేచ్చను భంగం కలిగిస్తోంది అని ముస్లిం ల ఆస్తులను కాపాడుకొనే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ముస్లిం ప్రజల ఆందోళనకు గురి చేస్తున్న వక్ఫ్ బిల్లును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి రాష్ట్ర ముస్లిం సంఘాలు సమాజం రుణపడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తవళీలు బాషా హమీద్, షబ్బీర్, అక్బర్, నూర్, మురారి చింతల సర్పంచ్ బాబా హుస్సేన్, కో ఆప్షన్ ఎంపీటీసీ రజాఖ్ బాబావలి, బాదుల్లా, ఇలియాజ్ ,చెన్నారెడ్డి కాలనీ వల్లి, తదితర ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## రాయలసీమ జోన్ అధ్యక్షులుగా పి.జే. రామ సుబ్బారెడ్డి

**కడప కార్పొరేషన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:**



పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాయలసీమ జోన్( కడప కర్నూల్ చిత్తూరు అనంతపురం) అధ్యక్షుడిగా పి.జే. రామ సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కడప వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్య ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కారావు ప్రధాన కార్యదర్శి, శ్రీ జే .అహరున్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. అనంతరం రాయలసీమ జోన్ అధ్యక్షులుగా పి.జే. రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ జోనల్ ఉద్యోగ, ఫీల్డ్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎఫ్ ఆర్ ఎస్ రద్దు పైన, యూనియన్ అభివృద్ధికి కృషి చేస్తూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని రామసుబ్బారెడ్డి తెలిపారు.

## కేసులకు రూ.10లక్షలు పరిహారం

**కడప లీగల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**



ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు కడప మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇన్‌ఛార్జి ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వర రావు, సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫక్రుద్దీన్, కడప సీనియర్ సీనియర్ సివిల్ జడ్జీ కె.ప్రత్యూషకుమారి న్యాయ సేవాసదన్ కడప నందు స్టాటిటరీ కమిటీ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ స్టాట్యుటరీ కమిటీ మీటింగ్‌లో విక్టిమ్ కాంపెన్సేషన్ నంబర్ 1/2023 కేసులకు రూ.5లక్షల పరిహారం, 3/2024కు రూ.5లక్షలు పరిహారం నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడప అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కడప జిల్లా రెవెన్యూ అధికారి, రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి, రాయచోటి సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు, కడప గవర్నమెంట్ ప్లీడరు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మరియు స్టాట్యుటరీ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

## అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్

**కడప లీగల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫక్రుద్దీన్ న్యాయ సేవా సదన్ కడప నందు అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎన్ఎస్ఎస్ అర్హత కలిగిన యూటీపీల గురించి చర్చించడానికి, మొదటి సారి నేరం చేసి శిక్షలో మూడింట ఒక వంతు పూర్తి చేసి సెక్షన్ 479 బీఎన్ఎస్ఎస్ ప్రకారం అర్హత కలిగిన యూటీపీల కోసం చర్యల గురించి చర్చించడం జరిగిందన్నారు. 70 సంవత్సరాల వయసు మరియు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న యూటీపీలు, గత సమావేశంలో గుర్తించిన యూటీపీల విడుదల సమీక్ష ఛైర్‌పర్సన్ అనుమతితో ఏదైనా ఇతర విషయం అంశాలను చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడప అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కడప డిస్టిక్ రెవెన్యూ అధికారి రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి, కడప పురుషుల కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ప్రత్యేక మహిళా కారాగార సూపరింటెండెంట్ డిస్టిక్ట్ సబ్ జైలు అధికారి పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

**సుండుపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**
మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆర్‌హెచ్ జీబిఎంఎస్ఎస్ సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ముబారక్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశమునకు మండలంలోని అన్ని గ్రామాల నుండి నీటి సంఘ అధ్యక్షులు టిసి మెంబర్లకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత గురించి, పొదుపు ఎలా చేయాలో పొదుపు చేసినటువంటి డబ్బులను తమ అవసరాలకు ఎలా ఉపయోగించుకోవాలో ఆర్థికంగా ఎలా బలపడాలో తెలియజేయడం జరిగింది. ప్రతి ఒక్కరూ చదువుకొని ఆర్థికంగా బలపడుతుంటే సమాజం బాగుపడుతుంది దేశం బాగుపడుతుంది కాబట్టి ఈ ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై మరి ఇలాంటి క్యాంపులు పెట్టుకోవడం చాలా ఆనందదాయకమని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి అభివర్ణించారు. పొదుపు గురించి అందరికీ అర్థమయ్యే రీతిలో కళాజాత ర వారిచే అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎస్ ముబారక్, ఎం బాబు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.




## టిడ్కో గృహాల పరిశీలన

**యర్రగుంట్ల ఏప్రిల్ 15 ప్రభాతవార్త**



పట్టణ శివారులలోని గల టిడ్కో గృహాలను జమ్మలమడుగు నియోజకవర్గం జనసేన కోఆర్డినేటర్ జగదీష్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు నెలరోజుల క్రితం కూడా తాను ఈ గృహాలను సందర్శించాలని అప్పట్లో మిగులులో ఉన్న రోడ్లను నివేదికను సిద్ధం చేసి మున్సిపల్ కమిషనర్ కి అందించినట్లు తెలిపారు. దాని ప్రకారమే మున్సిపల్ కమిషనర్ స్పందించి సంబంధిత పనులు అన్నిటినీ పూర్తి చేసి లబ్ధిదారులకు అందించనున్నామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ప్రస్తుతం రోడ్లు మరియు మంచినీటి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రిలు నారాయణ టెక్కో కార్పొరేషన్ చైర్మన్ అజయ్ వర్మ, స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి వేయించాడు. ఆధ్వర్యంలో లబ్ధిదారులకు గృహాలను అధికారికంగా అందజేయం ఉన్నట్లు వెల్లడించారు.

## గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పై చర్యలు చేపట్టాలి

**ఎడ్యుకేషన్ ఏప్రిల్ 15 ప్రభాతవార్త:**




చోటుపల్లె గ్రామంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తూ ఆరోపణలు,కేసులు నమోదు కాబడిన ప్రిన్సిపాల్ క్రిష్ణవేణిని కొనసాగింపు చేయడం ఆమెపై వచ్చిన ఆరోపణల్లో తీసుకునే చర్యలలో జాప్యం ఎందుకని PSFI జిల్లా ప్రధాన కార్యదర్శి కొడవటి కంటి నాగరాజు ప్రశ్నించారు. కేసు నమోదు కాబడిన వ్యక్తినీ ఇంకా ఆ గురుకుల పాఠశాలలో కొనసాగించడం దేనికి నిదర్శనం అని ప్రశ్నించారు. పాఠశాల ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకొని పాఠశాల నుంచి తక్షణమే తప్పించాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చందు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు

## ర్యాలీ, అవగాహన కార్యక్రమం

**మదనపల్లిక్రైమ్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త.**



అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మదనపల్లి అగ్నిమాపక శాఖ రెండో రోజు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. మదనపల్లి అగ్నిమాపక స్టేషన్ నుండి అగ్నిమాపక సిబ్బంది కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ చిత్తూరు బస్టాండ్ సర్కిల్, నిమ్మనపల్లి సర్కిల్, ఎన్ వి ఆర్ లేఅవుట్, మోతీ నగర్ ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా మదనపల్లి అగ్నిమాపక అధికారి జి. శివప్ప మాట్లాడుతూ, వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎటువంటి అగ్ని ప్రమాదం సంభవించినా తక్షణమే 101 లేదా 08577222101 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలని కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెంకటేష్‌కు ఆర్థిక సహాయం

**మదనపల్లి క్రైమ్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త.**



అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటేష్ కు ఏపీ ఎస్‌యుఎఫ్ సమస్త ఆర్థిక సాయాన్ని అందజేశారు. మంగళవారం సంస్థ వ్యవస్థాపకుడు ప్రణయ్ ఆధ్వర్యంలో రూ. 5,000 ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ, వెంకటేష్ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని తమవంతు సహాయం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్ యు ఎఫ్ సభ్యులు, అమ్మ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. వెంకటేష్‌కు ఆర్థిక సహాయం అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## చింతకుంట గ్రామ సందర్శనలో ఎంపీడీవో

**ముద్దనూరు, ఏప్రిల్ 15, ప్రభాత వార్త:**



మండలంలోని చింతకుంట గ్రామంలో మంగళవారం మండల అభివృద్ధి అధికారి ముకుందా రెడ్డి గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య, అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాల ను సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. అనంతరం గ్రామంలో ఉపాధి కూలీలు నిర్వహిస్తున్న ఉపాధి పని ప్రదేశాన్ని పరిశీలించారు. అతి ప్రాచీనమైన చింతకుంట గుహలను సందర్శించి ఆదిమానవులు గీసిన రేఖా చిత్రాలను దర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో గంగయ్య కార్యదర్శి విద్యాసాగర్, వీఆర్వో లక్ష్మీదేవి, సచివాలయ సిబ్బంది, గ్రామ సర్పంచ్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 15 ప్రభాతవా ర్త**
రాజంపేట నార్త్ సెక్షన్ ,సౌత్ సెక్షన్ పరిధిలో బుధవారం నూనెవారిపల్లి ఫీడర్ కింద విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించే కార్యక్రమం చేయడం జరుగుతుందని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.అందువల్ల ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 10:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.. నూనెవారిపల్లి రోడ్, భవాని నగర్, ఎగుగడ్డ, కొలిమి వీధి, వినాయక నగర్, రసూల్ నగర్ , లక్ష్మీ నగర్, వైయస్సార్ నగర్, విద్యుత్ నగర్, రాజునగర్, రాజు స్కూల్ ఏరియా, నలంద స్కూల్ ఏరియా ప్రభావితం చేస్తుందన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తూ వినియోగదారులు సహకరించాలన్నారు.

## ఆక్రమణలు తొలగించాల్సిందే

**వాల్మీకిపురం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :**
పట్టణ నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండు ప్రాంతంలో పంచాయతీ కాలువపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించే కార్యక్రమాన్ని మంగళవారం అధికారులు చేపట్టారు ఆక్రమణ దారులకు నెలన్నర క్రితమే నోటీసులు ఇచ్చామని, అయితే ఇప్పటి వరకు సంబంధిత దుఖాణ యజమానులు తొలగించకపోవడం బాధాకరమని పంచాయతీ ఈవో రవీంద్రనాథ్ అన్నారు మంగళవారం స్థానిక ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందో భస్తుతో జేసీబీ సహాయంతో ఆక్రమణల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. ఈ నేపథ్యంలో పంచాయతీ కాలువపై ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగింపు ప్రక్రియ జరుగుతుండగా మరో 24 గంటల సమయం ఇస్తే తామే స్వచ్ఛాందంగా తొలగిస్తామని దుఖాణదారులు అడగడంతో పంచాయతీ ఈవో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ తాత్కాలికంగా వాయిదా వేశారు. దుఖాణ దారులే మరో 24 గంటల సమయంలో స్వచ్ఛాందంగా తొలగించాలని ఈవో ఆదేశించారు. ఇందుకు దుఖాణ దారులు అంగీకరించడంతో తొలగింపు కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు. కార్యక్రమంలో పంచాయతీ, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.



## కార్యకర్తల సమస్యల పరిష్కారమే ధ్యేయం



**ముద్దనూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**
పట్టణములోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం నాడు జమ్మలమడుగు టీడీపీ ఇన్చార్జ్ భూపేశ్ సుబ్బరామిరెడ్డి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారమే టీడీపీ ధ్యేయం అన్నారు. ప్రతి ఒక కార్యకర్త ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎర్రగుంట్ల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రామిరెడ్డిపల్లి నాగరాజు, టిడిపి మండల అధ్యక్షుడు శివరామిరెడ్డి, శెట్టివారిపల్లె చంద్ర, ఆది, శ్రీకాంత్ మండలంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక స్థలం కేటాయించాలి



**పెనగలూరు ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**
మండలం తాసిల్దారుల కార్యాలయం నందు కొందూరు పంచాయతీ వెంగమాపురం గ్రామం ప్రజలకు స్మశాన వాటిక స్థలం కేటాయించాలని ప్రజలు యూత్ కలిసి ఎమ్మార్వో అమరేశ్వరికి అర్జీ ఇవ్వడం జరిగింది. పెద్దలకాలం నుండి ఒకచోట గాజుపూస దహన సంస్కరణలకు స్థలం వాడుకుంటుండగా కొంతమంది ఆక్రమణకు గురవుతున్నదని ఎమ్మార్వోకి తెలియజేయడం జరిగింది. సర్వే నిర్వహించి స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వారు తెలియజేయడం జరిగింది. ఎమ్మార్వో సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని తెలియజేయడం జరిగింది. వినతి పత్రం ఇస్తున్న వెంగమాంబపురం ప్రజలు మలిసెట్టి నారాయణ, మహేష్, నరసింహ, సుబ్బరాయుడు, సుబ్బ నరసయ్య, రామయ్య, హరి, సుబ్రహ్మణ్యం ప్రజలు, యూత్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**పెనగలూరు ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**
మండల కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు తమ ప్రతిభని కనబరిచారు. మొదటి సంవత్సరంలో ఈ ప్రశాంత్ సీఈసీ 320/500, ఆర్ నరసింహులు సీఈసీ 305/500, జీ.అమృత బైపీసీ 267/440. రెండవ సంవత్సరం పి ప్రదీప్ బైపీసీ 842/1000, యూ.భాగ్య లక్ష్మి ఎంపీసీ 706/1000, యం.లతా సీఈసి 768/1000 మార్కులుగా సాదించి కళాశాలకి వాళ్ళ తల్లితండ్రులకి వన్నె తీసుకొచ్చారు అని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి

**పెనగలూరు ఏప్రిల్ 15, ప్రభాతవార్త :**



మండలం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా, మండల అధ్యక్షుడు కోనేటి రెడ్డి కృష్ణ రాయల్. ఆధ్వర్యంలో బెస్తపల్లి సర్కిల్ దగ్గర మరియు మూగవారిపల్లి దగ్గర బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనముగా నినాదాలు చేస్తూ భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొని మిఠాయిలు పంచుకున్నారు ఈయొక్క కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చంద్రమోహన్ మరియు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు తోట నాగేశ్వరావు మరియు మండల ప్రధాన కార్యదర్శులు మోహన్ యాదవ్, టి వెంకట్ రమణ. మరియు పదాధికారులు రాముడు, భీముడు, సురేష్, సుబ్రహ్మణ్యం, సుబ్బరాయుడు, నరసింహులు, ఈశ్వరయ్య, సాంబయ్య, భాస్కర్, తదితరులు కార్యక్రమంలో ఘనంగా పాల్గొన్నారు.

## టాప్ మైండ్ జూనియర్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:**




పట్టణంలోని పేస్ ఐఐటీ, మెడికల్ అకాడమీ ఆధ్వర్యంలో టాప్ మైండ్ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మొదటి సంవత్సరం నుండే అద్భుత ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీ యుగంలో, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో స్థాపించబడిన టాప్‌మైండ్స్ పేస్ ఐఐటీ,మెడికల్ కాలేజీ మొదటి సంవత్సరం నుండే అద్భుతమైన ఫలితాలు సాధించడం మాకు గర్వకారణంగా ఉందని 2025 ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎంపీసీ,బై.పి.సి రెండు గ్రూపులలో కూడా తమ కళాశాల విద్యార్థులు అత్యున్నత మార్కులతో టాపర్లుగా నిలిచారన్నారు. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను జి. మహమ్మద్ సాహిల్ 465, టి. బాబా ఫక్రుద్దీన్ 462, ఎస్. ఆశ్రఫ్ అహ్మద్ 460, పిఎస్ ఇశ్రా అమీన్ 456 మరికొందరు విద్యార్థులు 440కి పైగా మార్కులు సాధించారని బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను ఎస్. అఖిల రూహి 433, డి. హుమేరా 416, ఫైజా శిరీన్ 410, ఆర్. జారాసన 408 బి. ఆదిత్య రెడ్డి 408 ఇతర విద్యార్థులు కూడా 400కి పైగా మార్కులతో టాప్ ర్యాంకులు సాధించారన్నారు. ఈ విజయాల్లో భాగమైన ప్రతి విద్యార్థికి, వారి తల్లిదండ్రులకు, విద్యా బృందానికి అభినందనలు తెలిపారు.మా సంస్థ స్థాపించిన తొలి సంవత్సరం నుండే ఇంత గొప్ప ఫలితాలు రావడం ఆనందించదగ్గ విషయమని విద్యార్థుల కళల్ని నిజం చేయడం మా లక్ష్యం అన్నారు.

## శ్రీనిధి రుణాలు గురించి అవగాహన సదస్సు

**సుండుపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మడితాడు యూనిట్ లోని మడితాడు వివో 4, గ్రామ సమాఖ్య సంఘం సమావేశం జరిగింది. ఇందులో సి సి రమణ ప్రభుత్వ పథకాలు, శీది లకు సున్నా వడ్డీ రాయితీ గురించి శ్రీనిధి గురించి వివరించారు. అనంతరం యూనిట్ ఇంచార్జి ఎస్. వెంకటయ్య పిఎండిఎస్ విధానం గురించి నవ ధాన్యలు ఇరవై నుండి ముప్పై రకాలు భూమి లో వేయడం వలన, సూక్ష్మ జీవులు అభివృద్ధి చెంది ప్రధాన పంటకు అందిస్తా యని, కలుపు రాకుండా నివారించవచ్చు నని, ప్రతి మహిళా సభ్యురాలు తమ పొలాలు యందు విధి గా నవ ధాన్యలు వేసుకోవాలని వివరించారు. ఇందులో వివోఏ నాగమునెమ్మ, గ్రామ సమాఖ్య సంఘం సభ్యులు, ఎస్ హెచ్ జి సభ్యులు పాల్గొన్నారు



## నేటి నుండి తెట్టు పాలేటి గంగమ్మ జాతర

కురబలకోట ఏప్రిల్ 15 ప్రభాతవార్త



కురబలకోట మండలం తెట్టు గ్రామం పూజారి వాండ్లపల్లి లో వెలసిన పాలేటి గంగమ్మ జాతర బుధవారంతో మొదలవుతుందని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. నేటి నుండి మూడు రోజులు పాటు ఈ జాతరను ఘనంగా నిర్వహించనున్నారు. ఈనెల 16న అఖండ ద్వీప ప్రజ్వలన. 17న అమ్మవారికి బోనాలు, 18 రాత్రి తిరుణాల, 19న పగులు తిరుణాల, కల్లిపాటు వంటివి ని ర్వహించడం జరుగుతుందన్నారు. 17 నుంచి 19వ తేదీ వరకు అన్నదానం నిర్వహించబడును. కావున భక్తాదులందరూ పాల్గొని తీర్థప్రసాదాలు, మొక్కులు చెల్లించుకోవాలని ఆలయ కమిటీ అధ్యక్షులు పూజారి అంజి, ధర్మకర్త పూజారి రమణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రెగ్యులర్ కార్యదర్శిని నియమించండి

దువ్వూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

దువ్వూరు గ్రామ పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని దువ్వూరు ప్రజలు కోరుతున్నారు. ఇటీవల దువ్వూరు గ్రామ పంచాయతీకి ఎవరు వచ్చినా కొద్దిరోజులు విధి నిర్వహణ చేయడం సెలవుపై వెళ్లడంతో గ్రామ పంచాయతీకి ఇంచార్జ్ కార్యదర్శులే దిక్కు అవుతున్నారు. ప్రస్తుతం కానగూడూరు పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ దువ్వూరు పంచాయతీకి ఇంచార్జ్‌గా వ్యవహిస్తున్నారు. గ్రామ పంచాయతీలలో కానగూడూరు, దువ్వూరు జనాభా ఎక్కువ కావడంతో ఇంచార్జ్ కార్యదర్శి దువ్వూరు పంచాయతీపై దృష్టి పెట్టలేక పోతున్నారు. మండల కేంద్రమైన దువ్వూరులో పైప్‌లైన్‌లు, పారిశుధ్యం, ఇంటి పన్ను, నీటి పన్ను వసూళ్లు చేయవలసి ఉంది. వీటిపై ప్రత్యేకంగా దృష్టి పెడితే కానీ ఈ పనులు కావు. ప్రస్తుతం ఇంచార్జ్ కార్యదర్శి గంటో, రెండు గంటలో ఉండి వెళుతున్నారు. అక్కడ జనణ, మరణ ధృవీకరణ పత్రాలు ఇతర అవసరాలకు వచ్చే ప్రజలకు సమాధానం చెప్పేవారు కరువు అవుతున్నారు. అందువల్ల దువ్వూరు గ్రామ పంచాయతీలో 10వేల జనాభా ఉన్నందున వెంటనే రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

## 18 నుంచి గంగా భవానీ జాతర ఉత్సవాలు

దువ్వూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:

మండల పరిధిలోని చింతకుంట గ్రామంలోని అత్తా కోడళ్ల చెరువులో వెలసి ఉన్న శ్రీ గంగా భవాణి ఆలయంలో ఈ నెల 18 నుంచి 20వ తేది వరకు గంగ జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలలో భాగంగా 18వ తేదిన పెద్దిరాజు కథ, అలాగే 19వ తేదిన వివిధ పూజా కార్యక్రమాలు, గంగా కాటమరాజు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. అలాగే 20వ తేది ఆదివారం అమ్మవారికి బోనాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జాతర ఉత్సవాల సంధర్భంగా వివిధ కోలాట బృందాలచే కోలాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19వ తేది శనివారం గంగాభవాణి జాతర సంధర్భంగా పెద్దఎత్తున బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని ఈ పోటీలలో గెలుపొందిన ఎద్దులకు 70వేలు, 50వేలు, 40వేలు, 30వేలు, 20వేల రూపాయలు బహుమతులుగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పెద్దఎత్తున జరిగే ఈ జాతర ఉత్సవాలలో అందరూ పాల్గొనాలని తెలిపారు.

## అగ్నిమాపక వారోత్సవాలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిబ్బంది

పీలేరు ఏప్రిల్ 15 ప్రభాతవార్త:

అగ్నిమాపక వారోత్సవాల సందర్భముగా రెండవ రోజు, మంగళ వారం పీలేరు బస్ స్టేషన్ యందు ప్రయాణికులకు కర పత్రములు పంపిణి చేసి అగ్నిప్రమాదముల సంబవించినపుడు ఏ విధంగా ఆర్పివేయాలో తెలియజేసి మరియు ఫైర్ సిబ్బంది వాటర్ డెమో చేసి ప్రజలను చైతన్యవంతులను చేయడమైనది, బస్ స్టేషన్ నందు ప్రయాణికులకు ఫైర్ లపై అవగాహన కల్పించడమైనది. ఏదయిన ప్రమాదం జరిగిన ఎడల అగ్నిమాపక కేంద్రమునకు సమాచారము అందించాలని 101 మరియు 08584 244399/9963736587 నంబర్లు ఇవ్వడమైనది. ఈ కార్యక్రములో పీలేరు అగ్నిమాపక కేంద్రాధికారి ఎస్.మస్తాన్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రికార్డులు లేని ఐదు వాహనాలు స్వాధీనం



బద్వేలు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

కడప జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఉత్తర్వుల మేరకు మైదుకూరు సబ్ డివిజనల్ ఆఫీసర్ జి. రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బద్వేల్ అర్బన్ ఇన్స్పెక్టర్ రాజగోపాల్, ఎస్ఐలు సత్యనారాయణ, బి కోడూరు రాజు ,బద్వేల్ రూరల్ ఎస్ఐ.శ్రీకాంత్ అట్లూరు ఎస్ ఐ రామకృష్ణ మరియు సిబ్బంది తో కలిసి బద్వేల్ టౌన్ లోని సుందరయ్య కాలనీ మంగళవారం కార్డెన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రిక్షా కాలనీలో రికార్డ్స్ లేని 5 వాహనాలను కనుగొని పోలీస్ స్టేషన్ కు తరలించడం అయినది. అలాగే ఆ ఏరియాలో గల పాత నేరస్తులు మరియు సస్పెక్ట్ లు, రౌడీ షీటర్ ఇండ్లలో తనిఖీ చేసి ఏమైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపకారం చర్యలు తీసుకుంటామని తెలియజేయడమైనది. అలాగే మట్కా మరియు గ్యాంబ్లింగ్, అక్రమ గంజా గురించి మరియు సైబర్ నేరాల గురించి మహిళలు మరియు చిన్నపిల్లలపై జరిగే నేరాల గురించి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మీ ఏరియాలోకి కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చిన ఏదైనా సమాచారం ఉన్న యెడల పోలీసులకు 112 నంబర్కు ఫోన్ చేయాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మసీదులలో బాల్యవివాహాలను అరికట్టండి

పీలేరు ఏప్రిల్ 15 ప్రభాతవార్త :



తహసిల్దార్ కు వినతి పత్రం అందజేస్తున్న నవాజుద్దీన్

పీలేరు మండల పరిధిలోని మసీదులలో జరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టాలని పీలేరు తహసిల్దారు భీమేశ్వరరావును ప్రభుత్వ మైనారిటీస్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుండి ఖాజీగా విధులు నిర్వహిస్తున్న కె.ఎస్. నవాజుద్దీన్ కోరారు. ఈ సందర్భంగా తాహసిల్దారు కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో పీలేరు మండలంలోని మసీదులలో నిర్వాహకులు వివాహాలు చట్ట వ్యతిరేకంగా నిర్వహిస్తున్నారని అన్నారు. సక్రమమైన ధ్రువపత్రాలు లేకుండా వధూవరులకు వివాహాలు జరపడం వారి భవిష్యత్తుకు అంత మంచిది కాదు అని అన్నారు. గుట్టు చప్పుడు కాకుండా అలా వివాహాలు జరిపించడంవలన వధూవరుల జీవితాలతో చెలగాటమాడుతూ వారి కుటుంబాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. నిర్ణీత రుసుము కన్నా ఎక్కువగా ఇష్టారాజ్యంగా వధూవరుల నుండి వసూలు చేసుకుని సొంత రసీదు పుస్తకాలతో విచ్చలవిడిగా వివాహాలు జరిపించడం పై ఆవేదన చెందారు. బాల్యవివాహాలను అరికట్టాల్సిన ఐసిడిఎస్ శాఖ వారు కూడా మసీదుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై తగిన ఆదేశాలను తమ సిబ్బంది ద్వారా మసీదు నిర్వాహకులకు తెలియజేస్తామని తహసిల్దారు సానుకూలంగా స్పందించారు. అనంతరం ప్రభుత్వ ఖాజీ కె ఎస్ నవాజుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులతో మైనారిటీస్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుండి నియమించబడిన ఖాజీ ల ద్వారా ముస్లింలు అధికారికంగా వివాహాలు జరిపించుకోవచ్చునని అన్నారు. ముస్లిం కుటుంబాల వారు వివాహాలు జరిపించుకోవడానికి తమను సంప్రదించాలని కోరారు. ఎవరైనా మసీదులలో ధర్మకర్తగా ఉండి వివాహాలు జరిపిస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలి



పులివెందుల, ఏప్రిల్15,ప్రభాత వార్త:

కూటమి పార్టీ నాయకులు మట్టి మాఫియా అడ్డూ అదుపూ లేకుండా చిన్న రంగపురం పరిధిలోగల పిల్లిగుట్టలో మట్టి అక్రమ తవ్వకాలతో రూ.లక్షల్లో దండుకుంటున్నారు అని అక్రమ త్రవ్వక దారుల పై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్సిపి యువజన విభాగం పులివెందుల నియోజకవర్గ అధ్యక్షుడు వి.రామ్ లక్ష్మణ్ రెడ్డి,బాలక్క గారి వెన్నపూస ప్రతాప్ రెడ్డి ,రాజుల వివేకానంద రెడ్డి, రాజుల సుధీర్ రెడ్డి, వెన్నపూస రామ కేశవరెడ్డి పెద్ద రంగాపురం వైఎస్ఆర్సీపీ నాయకులు పులివెందుల తాసిల్దార్ నజీర్ అహ్మదుకు ఫిర్యాదు చేశారు. అనంతరం వైఎస్ఆర్సీపీ నాయకులు మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ చిన్నరంగా పురం సమీపంలో గల పిల్లిగుట్ట నుంచి అధికారుల అనుమతులు లేకుండా ప్రతిరోజూ లక్షల రూపాయల విలువైన మట్టి రవాణా జరుగుతుందని ధనార్జనే ధ్యేయంగా సామాన్యుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ సామాన్యులను దోపిడీ చేస్తున్నారు. అని నూతన గృహ నిర్మాణాలకు ఈ మట్టిని ఉపయోగిస్తుంటారు వారి అవసరాలను ఆసరాగా చేసుకుని వారి దగ్గర ట్రిప్ ట్రాక్టర్ కు సామాన్యుల చెంత రెండువేల నుంచి మూడు వేల రూపాయల వరకు డబ్బులు కాజేస్తున్నారన్నారు.ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటంతో మాఫియా ఆగడాలకు అంతులేకుండా పోతోందని ఎలాంటి అనుమతులు లేకపోయినా త్రవ్వకాలు జరుగుతున్నాయి అని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ లక్షల రూపాయలు విలువైన మట్టిని తరలిస్తు న్నారన్నారు. అని మట్టి మాఫియా , రాళ్ల మాఫియా ఆగడాలకు అధికారులు అడ్డుకట్ట వెయ్యకపోతే వైఎస్ఆర్సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని అన్నారు.

## మౌలిక సదుపాయాలతోనే గ్రామాల అభివృద్ధి



గాలివీడు, ఏప్రిల్ 15(ప్రభాతవార్త):

మౌలిక సదుపాయాల కల్పనతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం ప్యారంపల్లి, గోపనపల్లి పంచాయతీలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకు రూ.3 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణాలు చేపట్టడం జరిగిందని త్వరలో మరో రూ.2 కోట్లతో మరిన్ని రోడ్ల నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి సమస్యను నివారించడానికి అన్ని గ్రామ పంచాయతీలలో 200పైన తాగునీటి బోర్లు వేయించామని తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్య లేకుండా దరఖాస్తు చేసుకున్న చాలా మందికి ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు పట్టణాలలో క్రిటికల్ కేర్ మంజూరైతే అందులో ఒకటి రాయచోటికి కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ ఏడాది నూతనంగా మామిడిచెట్లకు రైతులు ఇన్సూరెన్స్ ప్రీమియాన్ని చెల్లించడం జరిగిందని కావునప్రభుత్వ నాంస్ ప్రకారం మామిడి తోటలు దిగుబడి దెబ్బతింటే వాటికి ఇన్సూరెన్స్ వర్తించడానికి సంబంధిత మంత్రితో మాట్లాడటం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సగినాల పాల్ ప్రకాష్ బిషప్ కు ఘన సన్మానం

పులివెందుల,ఏప్రిల్15,ప్రభాత వార్త:



కడప మెత్రాసనానికి,రోమన్ క్యాథలిక్ మిషన్ అధినేత రోమ్ నగరం,వాటికన్ సిటీకి చెందిన పరిశుద్ధ ఫ్రాన్సిస్ పోప్ దూత నున్షియో లియో పోల్డ్ గిరిలి మరియు తెలుగు క్యాథలిక్ చర్చ్ బిషప్ కార్డినల్ అంతోనిచే అభిషేకింపబడిన సగినాల పాల్ ప్రకాష్ బిషప్ ను పులివెందుల పునీత జోజప్ప దేవాలయం పులివెందుల గురువులైన రెవరెండ్ ఫాదర్ ఆరోగ్య స్వామి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోటూరు చిన్నప్ప మరియు సంఘ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం పెద్దలు దమయన్ రెడ్డి. ఎస్ చిన్నప రెడ్డి, బి. భూషణం, ఏ. రాయపరెడ్డి, ఎక్సలెంట్ నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ టి. ఐ కుమార్, ఆర్. చిన్నపరెడ్డి, మాధవరెడ్డి, లాజర్, టి.ఏసేపు, ప్రభాకర్, జి. స్వామిదాసు, మేరీదాసు,బి.పేతురు, వి.మధు, కుమార్, జి. ప్రసాదు,మరియు ఉపదేశి వి.బాబు పులివెందుల విచారణ తరుపున అభినందనలు తెలియజేసి, ఘనంగా పూలమాలలతో, శాలువా లతో సన్మానించారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




చాపాడు. ఏప్రిల్ 15. ప్రభాతవార్త..

నేటి సమాజంలో ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి, ఖాజా మైనుద్దీన్ తెలిపారు. మంగళవారం భద్రపల్లె గ్రామపంచాయతీ పుల్లారెడ్డి నగర్ లో మండల న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంతో చేసే చిన్న పొరపాట్ల వల్ల భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. చిన్న తప్పిదాల వలన సివిల్ కేసులు క్రిమినల్ కేసులుగా మారే అవకాశం ఉందన్నారు. కావున మనం చేసే ప్రతి పని ఆలోచనతో చేయాలి కానీ ఆవేశంతో చేయకూడదు అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జెకె, చారి, శివకుమార్, డిప్యూటీ తహసిల్దార్ ఎన్ ఎల్ వి కృష్ణారెడ్డి, ట్రైనీ డీఎస్పీ భవాని, కోర్టు కానిస్టేబుల్ రామ సుబ్బారెడ్డి, బద్రి పల్లి సర్పంచ్ భర్త గుత్తి వీరనారాయణ యాదవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం

వేంపల్లె : ఏప్రిల్ 15 (ప్రభాత వార్త):



వేంపల్లిలో తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వేంపల్లె సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మంగళవారం వేంపల్లి పంచాయతీ పరిధి లోని చింతలమడుగుపల్లి గ్రామంలో కొత్త బోరు పాయింట్ కోసం ఆయన పూజలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అందులో భాగంగా చింతలమడుగు పల్లె లో కొత్త బోరు ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించేందుకు పంచాయతీ చర్యలు తీసుకుంటుందని అన్నారు. నీటి సమస్యను తాత్కాలికంగా కాకుండా శాస్వత పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తెలిపారు.

## రావణబ్రహ్మ వాహనంపై రామలింగేశ్వర స్వామి



ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :

పెన్నానది తీరాన సాక్షాత్తు శ్రీరామునిచే ప్రతిష్ఠితమైన రామేశ్వరంలోని శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ ముక్తి రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీధర్, దేవస్థానం పాలకమండలి చైర్మన్ మార్తల రాజారెడ్డి, పాలక మండలి కమిటీ సభ్యులు మరియు ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రధాన కలశ పూజ, హోమం, అనంతరం ప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం దేవస్థానం నందు లలితా సహస్రనామ స్తోత్ర కుంకుమార్చన, దశ హారతులు అనంతరం ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం రాత్రి 8 గంటలకు స్వామి వారు రావణబ్రహ్మ వాహనంపై రామేశ్వరం పుర వీధుల్లో మేళతాళాలు, మంగళ వాయిద్యములతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తాదులు అందరూ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

## పని-జీవితం మధ్య సమతుల్యం తప్పనిసరి

(కర్ణాటక హైకోర్టు తీర్పు)

బద్వేలు లీగల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త :

ప్రతి ఉద్యోగికి వర్క్-లైఫ్ బ్యాలెన్స్ అనగా పని, జీవితం మధ్యం సమతుల్యం తప్పనిసరి అని, శక్తికి మించి పని చెబితే ఒత్తిడితో ఇబ్బంది పడుతున్న క్రమంలో ఉద్యోగి నిద్రలోకి జారుకుంటే తప్పు ఎలా అవుతుందని కర్ణాటక హైకోర్టు వ్యాఖ్యానించింది. సామర్థ్యానికి మించిన పని అప్పగించినపుడు మనిషికి ఖచ్చితంగా విశ్రాంతి అవసరమని, సహజమైన నిద్ర నుంచి మనిషిని దూరం చేస్తే ఎలా? అని, అందులోను షిఫ్ట్‌ల వారీగా అనగా వంతుల వారీగా పని చేసినపుడు ఉద్యోగులను నిద్ర-విశ్రాంతి వంటి కీలకమైన వాటి నుంచి దూరం చేస్తే ఎలా? అని ధర్మాసనం ప్రశ్నిస్తూ "కర్ణాటక రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో పనిచేసే ఓ కానిస్టేబుల్ విధుల్లో ఉండగా నిదురపోయాడు; దీనిపై భగ్గుమన్న ఉన్నతాధికారులు కానిస్టేబుల్‌ను వివరణ కోరారు, వరుస సిఫ్ట్‌లు డ్యూటీ చేయడం వలన తన ఆరోగ్యం బాగా దెబ్బతినిందని వైద్యుల సలహా మేరకు మందులు వాడుతున్నానని, ఆ మందుల కారణంగా డ్యూటీలో నిదుర తెలియకనే ముంచుకొచ్చి 10 నిమిషాల పాటు విశ్రాంతి తీసుకున్నానని కానిస్టేబుల్ వివరణ ఇవ్వగా సదరు వివరణతో సంతృప్తి చెందని పై అధికారులు అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేశారు. దీంతో సదరు కానిస్టేబుల్ తన సస్పెన్షన్ పై కర్ణాటక హైకోర్టును ఆశ్రయించగా పిటీషన్‌ను ధర్మాసనం విచారించి విధుల్లో నిదురపోవడం ఏలాంటి తప్పిదం కనిపించడం లేదని, వరుస సిఫ్ట్‌లతో 16 గంటల పాటు పనిచేయడం వలన అధిక పని భారంతో కూడిన ఒత్తిడితో ఇబ్బందులుపడ్డాడని, అందుకే సదరు కానిస్టేబుల్ నిదురపోయాడని అతనిపై సస్పెన్షన్ సరైన చర్య కాదని, తిరిగి కానిస్టేబుల్‌ను విధుల్లోకి తీసుకోవాలని ధర్మాసనం ఆదేశిస్తూ యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ ఆర్టికల్-24 ప్రకారం ప్రతి ఉద్యోగికి విశ్రాంతి హక్కు ఉంటుందని, వేతనంతో కూడిన కాలానుగుణ సెలవులు తీసుకునే హక్కు కూడా ఉంటుందని ధర్మాసనం పేర్కొంటూ అంతర్జాతీయ కార్మిక సంఘ ఒప్పందాల ప్రకారం ప్రతి ఉద్యోగికి, మరీ ముఖ్యంగా సిఫ్ట్‌ల వారీగా పనిచేసే వారికి వర్క్-లైఫ్ బ్యాలెన్స్ తప్పనిసరి అని కూడా తెలిపింది. కొన్ని కొన్ని అసాధారణ సందర్భాలు మినహాయిస్తే రోజుకు 8 గంటలు, వారంలో 48 గంటలుగా పని గంటలు అనగా వర్కింగ్ హవర్స్ మించకూడదని ధర్మాసనం నొక్కి వక్కానిస్తూ ఈ తీర్పును వెలువరించింది. (చంద్రశేఖర్ మరియు డివిజనల్ కంట్రోలర్ డబ్ల్యుపి నెం.106142/2024, కెహెచ్‌సి)

## శ్రీ జ్ఞానంబికా విద్యార్థిని

## జైత్ర మాధుర్ గిన్నిస్ రికార్డు



మదనపల్లి క్రైమ్ ఏప్రిల్ 15 ప్రభాతవార్త.

శ్రీ జ్ఞానంబికా జూనియర్ కళాశాలలో విద్యార్థి యస్. జైత్ర మాధుర్ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిందని కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురు ప్రసాద్ తెలిపారు. కరస్పాండెంట్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురు ప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు గణేష్ బుక్ ఆఫ్ సాధించటం కళాశాలకే గర్వకారణం అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో అత్యధికంగా 4218 మంది పాల్గొనగా, అందులో జైత్ర మాధుర్ చేసిన నృత్యం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా శ్రీ లలిత కళ ఆర్ట్స్ ద్వారా గురువు బాలాజీ వద్ద మాధుర్ శాస్త్రీయ నృత్యంలో శిక్షణ తీసుకోవటం జరిగిందన్నారు . మాధుర్ యొక్క ప్రతిభను గుర్తించిన తల్లిదండ్రులు పార్వతి, మహేష్ లు ఆమెను నిరంతరం ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, మాధుర్ అకుంఠిత దీక్ష ఈ అరుదైన గిన్నిస్ రికార్డును సాధించడానికి దోహదపడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, వెంకటా చలపతి, డాన్స్ మాస్టర్ బాలాజీ, తల్లిదండ్రులు పార్వతి, మహేష్ లు పాల్గొన్నారు.












